ఆఫీసులోవాళ్ళే తమ చెల్లెలిని లేదా కూతురుని చేసుకుంటావా అని అనేకసార్లు అడిగారు. ఈ మధ్యే జరిగిన తమ రిసెప్షన్‌కి చాలామంది వచ్చారు. దశరథరామయ్య దగ్గర రాజేష్ సురక్షితంగా ఉన్నాడని తెలిసాక స్కూటర్ పోనిచ్చాడు. వెనకాలనుంచి నీరజ వెక్కి-వెక్కి-ఏడ్చేచప్పుడు వినపడుతోంది.

"ష్. ఊరోక్కో" కుడిచేత్తో నీరజ తలమీద రాసాడు స్కూటర్ పోనిస్తునే.

"ఛీ! ఛీ! ఇంతద్రోహం చేస్తాడనుకోలేదు. బాధనంతా మనసులో దాచుకుని చిన్నపిల్లవాడని ఇంతచేస్తే..."

"నేను యూనియన్ మనిషిని. యూనియన్‌లో నాకు సవాలక్షగొడవలు. అందుకని నేనంటే గిట్టనివారు అరిచారు. అంతే, అదేంపట్టించుకోకు."

దశరథరామయ్య ఆటోలో రాజేష్‌ని ఎక్కించుకుని ఇంటికి బయల్దేరాడు.

"ఏమైంది తాతయ్యా? నేనేం తప్పుచేసాను?" అడిగాడు రాజేష్ ఏడుస్తూ.

"నువుకాదు, ఊరోక్కో"

"మరి పిన్ని నన్నెందుకలా తిట్టింది"

"ఏంలేదు, ఊరోక్కోమన్నానా?"

"మీ అబ్బాయి మానాన్నకాదా? ఏదోఉంది, నువు చెప్పడంలేదు తాతయ్యా."

ఆ సమయంలో, రవీంద్రభారతిలో...

"బిచ్చగాడిపాత్రలో ప్రథమ బహుమతి పొందిన కె. సాంబశివరావుని స్టేజీమీదకి రమ్మనమని కోరుతున్నాం" అని అనౌన్స్ చేస్తూంటే, చాలా చప్పట్లు, కొన్ని కేకలు, ఈలలు.

దశరథరామయ్య దారిలో ఓకిళ్ళీకొట్టుదగ్గర ఆటో ఆపించి ఓచుట్ట కొన్నాడు.

"నాకు మనసేం బాలేదురా. ఈఒక్కటి తాగనీ..." రాజేష్‌తోచెప్పి, దాన్ని అంటించుకున్నాడు.

ఆ అడిటోరియంలో ఒకేఒకవ్యక్తి వాళ్ళ గురించి, ముఖ్యంగా నీరజ గురించి, బాధపడ్డారు ఆయన సైకాలజీ ప్రొఫెసర్ మేల్‌కొటే.

(ఇంకా వుంది)



# 'కె.బి. కృష్ణ'

## షాక్ (మినీ కథ)

మగవాళ్ళు బజారునుంచి ఎంత మంచి వస్తువులు తెచ్చినా, ఎంత చౌకగా తెచ్చినా, వస్తువులుకొనడం, బేరమాడటం, చేతకాదని, అకొట్టువాడు టోపీ వేశాడని ఆడవాళ్ళకి గట్టినమ్మకం. తాము ఇళ్ళ దగ్గరకు వచ్చినవి బేరమాడికొంటేనే వాళ్ళకు తృప్తి. ఆ రోజూ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేను.

శ్రీమతి ప్లేటులో టిఫినుతో, మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది. "మీ కిష్టమని పచ్చిమిరపకాయ బజ్జీలు చేశాను." బజ్జీలు తింటున్నాను. నిజం చెప్పద్దూ. మాఆవిడ చేతివంటకు ఎదురులేదు. అందులో పచ్చిమిరపకాయ బజ్జీలు చేయడంలోస్పెషలిస్ట్.

"ఎలావున్నాయ్" అంది.

"ఎలా వుంటాయ్. నీలాగే రుచిగా వున్నాయి" అన్నాను. లోపలకువెళ్ళి కాఫీ పట్టుకువచ్చింది. కాఫీ సిప్ చేస్తున్నాను.

"మీరేమీ కోప్పడనంటే, నేను ఈరోజున ఒక పనిచేశాను" అదీ అసలు సంగతి.

"ఏం చేశావ్"

"వీధిలోకి చీరలబ్బాయి వస్తేను తీసుకున్నాను. మీరు ఒకసారి నూట ఏభయి రూపాయలకు కొన్న పాలియెస్టర్ చీరఅలాంటిదే. గుర్తుందా? సరిగ్గా అలాంటిదే నేను ఎనభై రూపాయలకుకొన్నాను బేరమాడి" అంది ఏదో యడ్వెంచర్‌చేసినట్లుగా. గబాగబాలోపలకు వెళ్ళి తనుకొన్న చీర తీసుకువచ్చింది. పోలిథిన్ కవర్‌లోవుంది చీర. బయటకు తీసి చూశాను. డిజైన్ చాలాబాగుంది. క్వాలిటీకూడా ఫర్వాలేదు. అయితే ఎనభై రూపాయలకు ఎలాఇచ్చాడు? 'సెకండ్స్' అనిముద్రవుంది. అందువలన కొంచం తగ్గవచ్చు కానీ నాకు ఏదో అనుమానం వచ్చింది

"నీ చీరఇంకోటిపట్రా" అన్నాను. ఇంట్లో చీరతోనూ క్రొత్తచీరకొలిచి చూశాము. దాదాపు మీటరున్నర తక్కువవుంది.

"ఇదేమిటండీ. ఎలాకట్టుకోను. మాకు వాడు చూపించిన చీర 5 మీటర్లువుందే. మిగతా చీరలన్నీ ఒకటేనని మమ్మల్ని కవర్లలోంచి తియ్యనియ్యలేదు. ఇలాఅని తెలిస్తే వాడు చూపించినదే తీసుకునేదాన్ని" బిక్కమొగం వేసింది శ్రీమతి.

"డియర్, వీధిలోకి మూటలు తెచ్చేవాళ్లు చవగ్గా ఇస్తారంటే ఎందుకు ఇస్తారనుకున్నావ్ .... 3 1/2 మీటర్ల చీర ఎనభై రూపాయలకు ఇచ్చాడు. ఏరాయి అయితే నేం? పైగా ఈచీర "సెకండ్స్" అంటే ఫ్యాక్టరీలో ఏదోఒక లోపం వున్న చీరలు ఇలా ముద్రవేసి, గుట్టగాపోసి చౌకగా అమ్ముతారు. కాని ఒక్కోసారి మంచివికూడా దొరుకుతాయి. అయినా నెలాఖరులో నీకు డబ్బు ఎక్కడిది?" అడిగాను.

శ్రీమతి ఇంకా చిన్నబోయిన ముఖంతో—

"మొన్న మీ కథకి వంద రూపాయలు వచ్చాయికదా. అవి ఖర్చు పెట్టద్దని చెప్పారుకూడా. అయినా తీసేను."

షాక్ తినడం ఈసారి నావంతయింది. *




డా. పి.వి.కె. రావ్-సెక్స్‌స్పెషలిస్ట్

వైద్య విద్వాన్ వైద్యాచార్య

హస్తప్రయోగం, అంగంచిన్నదగుట, వరముల బిం హీనత సుఖవ్యాధులకు; సెక్స్, మతి భ్రమలకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా చికిత్సకలదు. స్వయంగా పరీక్షించి సంవాలు మందులు ఇవ్వగలము. ఆయుర్వేద ఇంజక్షన్లు, విద్యుచ్ఛక్తి పరికరములతో ప్రత్యేక చికిత్స!

రావూస్ క్లినిక్,

టి. బి. రోడ్, తెనాలి. Phone : 3700 & 4010